సాక్షి జగిత్యాల

బుధవారం ၊ 17 ၊ ఏప్రిల్ ၊ 2024

ఘనంగా కుజదోష నివారణ పూజలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలను ఘనంగా నిర్వహించారు.



రైతులకు ఇబ్బంది రానీయొద్దు

రాయికల్: కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది రానీయొద్దని అడిషనల్ కలెక్టర్ రాంబాబు అన్నారు. ఉప్పుమడుగు, ఆలూరు కేంద్రాలు, మైతాపూర్ రైస్‌మిల్లును తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం 42.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ మరింత ముదురుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికం అవుతుంది. వేడిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఇల్లందకుంట సీతారాములకు పట్టువస్త్రాలు



సీతారాములకు ధర్మపురి ఆలయం పక్షాన పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకెళ్తున్న సిబ్బంది

ధర్మపురి: కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలోని శ్రీసీతారాముల వారికి శ్రీరామనవమి సందర్భంగా మంగళవారం పట్టువస్త్రాలు, తలంబ్రాలను తీసుకెళ్లారు. ఏటా శ్రీరామనవమి వేడుకల సందర్భంగా నృసింహస్వామి ఆలయం పక్షాన పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకెళ్తుంటారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా అక్కడి ఆలయ పూజారులకు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయం సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

'గ్రూప్–1'కు పకడ్బందీ ఏర్పాట్లు



కేంద్రాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్, జేఎన్‌టీయూ కో–ఆర్డినేటర్

జగిత్యాలక్రైం: గ్రూప్–1 పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ అన్నారు. జూన్ 9న నిర్వహించే గ్రూప్–1 పరీక్షలు నిర్వహించే కేంద్రాలను జేఎన్‌టీయూ రీజినల్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. గ్రూప్–1 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు అన్ని వసతులు, రవాణాసౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

కొనుగోళ్లు పూర్తయ్యే వరకూ కేంద్రాలు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న పీడీ సంపత్‌కుమార్

జగిత్యాలరూరల్: జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేవరకూ కేంద్రాలను నిర్వహించనున్నట్లు డీఆర్డీఏ పీడీ సంపత్‌కుమార్ అన్నారు. జగిత్యాలరూరల్ మండలం గుల్లపేటలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారులు తేమ శాతం చూసి ధ్రువీకరించిన వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు వివరాలను నిర్వాహకులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో డీటీసీఎస్ వరప్రసాద్, ఏపీఎం గంగాధర్, సీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే అభివృద్ధి



ప్రచారం చేస్తున్న సత్యనారాయణరావు

జగిత్యాలరూరల్: మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు అన్నారు. జగిత్యాల రూరల్‌మండలం మోరపల్లిలో నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. ప్రపంచదేశాలు దేశం వైపు చూస్తున్నాయన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ కొక్కుల గణేశ్, మండల ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు కర్నె నర్సింహారెడ్డి, నాయకులు గంగాధర్, రమేశ్, దేవయ్య, వేణు పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ వార్షికోత్సవం



విద్యార్థులతో వ్యవసాయ వర్సిటీ అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాలలోని పొలాస వ్యవసాయ పాలిటెక్నిక్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ భారతి నారయణ్ భట్ మాట్లాడుతూ రెండేళ్ల డిప్లొమో ద్వారా ఉన్నత విద్యావకాశాలు అందుకోవాలని, ఉద్యోగాల కోసం కాకుండా స్వయం ఉపాధి మార్గాలు అన్వేషించాలని సూచించారు. ముందుగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



తల్లి లక్ష్మి, సోదరి స్రవంతితో సాయికిరణ్



ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు సివిల్స్‌లో మెరిశారు. కరీంనగర్‌కు చెందిన సహన మొదటి ప్రయత్నంలో టార్గెట్ రీచ్‌కాగా... జిల్లాలోని వెలిచాలకు చెందిన బీడీ కార్మికురాలి కొడుకు సాయికిరణ్ రెండోప్రయత్నంలో లక్ష్యం చేరుకున్నారు.

సాయికిరణ్ 27.. సహన 739..

SUCCESS STORIES

- సివిల్స్‌లో మెరిసిన మనోళ్లు
- బీడీలు చుట్టి చదివించిన తల్లి
- పేదరికాన్ని జయించి లక్ష్యం చేరుకున్న సాయికిరణ్
- చేనేత కుటుంబం బిడ్డ కలసాకారం
- మొదటి ప్రయత్నంలోనే టార్గెట్ చేరుకున్న సహన

సాక్షిప్రతినిధి,కరీంనగర్/రామడుగు: ప్రతిభకు పేదరికం అడ్డు కానే కాదని మరోసారి రుజువైంది. తల్లిదండ్రులు కార్మికులైనా తాను కలెక్టర్ కావాలనుకున్న కలను ఎట్టకేలకు నెరవేర్చుకున్నారు.. పేదరికం కారణంగా కొలువు చేయాల్సి రావడం, కోచింగ్ తీసుకోకుండా సొంతంగానే ప్రిపేరయి రెండో ప్రయత్నంలోనే లక్ష్యం చేరుకున్నారు. సివిల్స్ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన నందాల సాయికిరణ్ విజయగాథను ఆయన సోదరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ స్రవంతి 'సాక్షి'కి వివరించారు. సాయికిరణ్ స్వగ్రామం రామడుగు మండలంలోని వెలిచాల. తల్లిదండ్రులు లక్ష్మి–కాంతారావు, సోదరి స్రవంతి ఉన్నారు. తండ్రి చేనేత కార్మికుడు, తల్లి బీడీ కార్మికురాలిగా పని చేస్తూ పిల్లల్ని పెంచారు. కుటుంబాన్ని బాగా చూసుకునేందుకు కాంతారావు మహారాష్ట్రలోని భీవండిలో చేనేత కార్మికుడిగా పని చేశారు. సాయికిరణ్ చిన్ననాటి నుంచి చదువులో ముందుండేవారు. ఐదో తరగతి వరకు సరస్వతి పాఠశాలలో చదివారు. ఆయన ప్రతిభను గుర్తించిన ఆ పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ కరీంనగర్‌లోని తేజస్విని పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించారు. 2012లో పదోతరగతి, ట్రినిటీ జూనియర్ కళాశాలలో 2014లో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేశారు. ఎన్ఐటీ వరంగల్‌లో సీటు సాధించిన సాయికిరణ్ 2018లో ఇంజినీరింగ్ పూర్తి చేయడంతోనే క్యాల్‌కమ్ కంపెనీలో ఉద్యోగం సాధించారు.

తండ్రి మరణించినా.. తల్లి అండతో..

ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతుండగానే సాయికిరణ్ తండ్రి 2016లో కేన్సర్ బారిన పడి మృతిచెందారు. దీంతో తల్లి లక్ష్మి కష్టపడి బీడీలు చుట్టి, తన ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. కూతురు స్రవంతి బీటెక్ పూర్తి చేసి, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో పని చేస్తున్నారు. సాయికిరణ్ 2018 నుంచి ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ పరీక్షలకు సిద్ధమయ్యారు. గతేడాది విఫలమైనా రెండోసారి ఆలిండియా 27వ ర్యాంకు సాధించారు. వీరి తల్లి లక్ష్మి ఇప్పటికీ బీడీలు చుడుతుందని గ్రామస్తులు తెలిపారు. కాగా, సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.



ప్రత్యేకత చాటుకున్న వెలిచాల..

గత పదేళ్లుగా ఉత్తమ గ్రామపంచాయతీగా పేరు పొందిన వెలిచాలకు ఇక్కడి అభివృద్ధి పనులపై స్టడీ టూర్ చేయడానికి దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పలువురు సివిల్ సర్వీస్ ప్రతినిధులు వచ్చి, వెళ్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న సాయికిరణ్ కష్టపడి చదివి, సివిల్స్ ర్యాంకు సాధించడంతో ఈ గ్రామం ప్రత్యేకత చాటుకుంది.



సహనకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



ఢిల్లీలో కోచింగ్ ...

కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక గీత–అనిల్ దంపతుల కూతురు సహన సివిల్స్ ఫలితాల్లో 739వ ర్యాంకు సాధించారు. ఆమె స్థానిక కెన్ క్రెస్ట్ స్కూల్లో పదోతరగతి, శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ జేఎన్టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. తర్వాత ఢిల్లీలో యూపీఎస్సీ కోచింగ్ తీసుకున్నారు. ప్రిలిమినరీ, మెయిన్స్ ఫలితాల్లో క్వాలిఫై అయ్యాక ఢిల్లీలో పలు మాక్ ఇంటర్వ్యూలకు అటెండయ్యారు. సహన తండ్రి అనిల్ కరీంనగర్‌లో పాత్రికేయుడిగా పని చేస్తున్నారు.

స్మితా సబర్వాల్ స్ఫూర్తి..

ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్ కలెక్టర్‌గా పని చేసిన స్మితా సబర్వాల్ తనకు స్ఫూర్తి అని సహన తెలిపారు. తాను పాఠశాలలో చదువుతున్నప్పుడు స్మితా మేడంలా కలెక్టర్ అవ్వాలని ఆ రోజుల్లోనే ఫిక్స్ అయ్యానని, ఆ కల నెరవేర్చుకునేందుకు తాను సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. దీనికి తల్లిదండ్రులు ఎంతగానో సహకరించారన్నారు. పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

తేమ తగ్గిన ధాన్యాన్నే కేంద్రాలకు తేవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలరూరల్: రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని, తేమ తగ్గిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. జగిత్యాలరూరల్ మండలం తాటిపల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. సమస్యలుంటే కలెక్టరేట్‌లోని టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 8187లో సంప్రదించాలన్నారు. ఎండలు మండుతున్న దృష్ట్యా రైతులు జాగ్రత్తగా ఉండాలని, వడదెబ్బ తగలకుండా చూసుకోవాలని సూచించారు. ధాన్యం ధరలు, టోల్‌ఫ్రీ నంబర్ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. డీఆర్‌డీఏ సంపత్‌రావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హతిరాం, తహసీల్దార్ రాంమోహన్, ఐకేపీ ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతు షురూ



లీకేజీలకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: జిల్లా కేంద్రంలో తాగునీటి పైప్‌లైన్‌కు అధికారులు మరమ్మతు చేపడుతున్నారు. జిల్లాకేంద్రంలో పైప్‌లైన్లకు తరచూ లీకేజీలు ఏర్పడడంతో నీరంతా వృథా అవుతోంది. మరోవైపు తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఈనెల 11న 'అంతటా లీకేజీలే' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు తాగునీటి సరఫరాను బంద్ చేశారు. ఈనెల 20 నుంచి 22 వరకు కొత్తబస్టాండ్ వాటర్ ట్యాంక్ పరిధిలోగల అరవింద్‌నగర్, కొత్తబస్టాండ్, పురాణిపేట, మోతెమాలవాడ, శ్రీరాంనగర్, ఎల్జీరామ్ ఏరియా, వాణీనగర్, టీట్‌బజార్, తులసీనగర్, భాగ్యనగర్, అటవీశాఖ కార్యాలయం ప్రాంతంలోని కృష్ణానగర్, సాయిరాంనగర్, గోవిందుపల్లి, బస్‌డిపో ఏరియా, టవర్ ఏరియా, మోచిబజార్, కరీంనగర్‌రోడ్, ఇస్లాంపుర, అంగడిబజార్ ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు తెలిపారు. ప్రజలు సహకరించాలని, నీటి సరఫరా పునరుద్ధరించేవరకూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఆహ్లాదం అంతంతే..!

కోరుట్ల:మినీట్యాంక్ బండ్.. కోరుట్ల పట్టణంలో సాయంత్రంవేళ జనం సేదదీరడానికి చక్కని వేదిక అవుతుందని ఆశపడిన జనం నీరుగారిపోతున్నారు. పద్నాలుగేళ్లుగా మినీట్యాంక్ బండ్ నిర్మాణం పనులు కొనసాగి.. గత అసెంబ్లీ ఎన్నికల ముందు తుదిదశకు చేరాయి. ఆ సమయంలో అట్టహాసంగా బోటింగ్ ప్రారంభించారు. సుమారు రెండు నెలలపాటు కొనసాగిన బోటింగ్ తరువాతికాలంలో ఆగిపోయింది. మినీట్యాంక్ బండ్ పర్యవేక్షణ, నిర్వహణ విషయంలో మున్సిపల్ అధికారులు పెద్దగా పట్టింపు చూపలేదు. ఫలితంగా ఈ వేసవిలో జనాలకు ఎంతో ఉపశమనంగా ఉంటుందని ఆశించిన మినీట్యాంక్ బండ్ ఉత్తదే అయింది.

- నిర్వహణ కరువైన మినీట్యాంక్ బండ్
- నిలిచిపోయిన బోటింగ్



రూ.8 కోట్లు వ్యయం

- కోరుట్ల పట్టణ సమీపంలో ఉండే మద్దుల చెరువును మినీట్యాంక్ బండ్‌గా మార్చాలని సుమారు 20 ఏళ్ల క్రితం అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ నాయకుడు సీహెచ్.విద్యాసాగర్‌రావు ప్రతిపాదించారు. అనంతరం కేవలం పూడికతీత పనులతోనే ప్రతిపాదన ఆగిపోయింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హయాంలో మినీట్యాంక్ బండ్ పనుల్లో కదలిక మొదలైంది. మొదట రూ.6 కోట్లు, ఆ తరువాత మరో రూ.రెండుకోట్లు కేటాయించడంతో గత అసెంబ్లీ ఎన్నికల ముందు మినీ ట్యాంక్‌బండ్‌కు తుదిరూపు వచ్చింది. ట్యాంక్‌బండ్‌పై అవసరమైన నిర్మాణాలు పూర్తయ్యాయి. చివరగా రెండు బోట్లను ఏర్పాటు చేసి బోటు షికారు ప్రారంభించడంతో జనం ఎంతో సంబరపడ్డారు.



పిల్లల పార్కు

మూడు నెలల మురిపెమే..

- మినీ ట్యాంక్‌బండ్‌లో బోటింగ్ ప్రారంభమైన సమయంలో ఎంతో ఉత్సాహంగా జనం బోట్ షికారు కోసం వచ్చారు. అనంతరం కాలంలో మినీ ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఎలాంటి సదుపాయాలూ కల్పించకపోవడంతో బోటు షికారుపై జనం ఆసక్తి తగ్గిపోయింది. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన సుందరమైన నిర్మాణాలు మెల్లమెల్లగా దెబ్బతింటున్నాయి. దీనికి తోడు మున్సిపల్ తరఫున మినిట్యాంక్ బండ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది ఏర్పాటు జరగలేదు. ఫలితంగా మినీ ట్యాంక్‌బండ్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. వేసవిలో మద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద సేద దీరాలనుకున్న జనం ఆశలు నీరుగారి మూడు నెలల మురిపెంగా మారింది.

పిల్లల పార్క్ ఒకే..

పట్టణంలోని సాయిరాంపురాలో ఉన్న పిల్లల పార్కు బాగానే ఉండటం కొంతలో కొంత పట్టణవాసులకు ఉపశమనం కలిగిస్తోంది. పిల్లల పార్కులో నిర్వహణ సరిగా ఉండటంతో సాయంత్రం వేళ ఆ పరిసరాల్లోని పిల్లలు ఉత్సాహంగా గడుపుతున్నారు. పార్క్‌లో ఫౌంటేన్ పనిచేయకపోవడం లోపంగా మారింది.



మినిట్యాంక్ బండ్

మినీ ట్యాంక్‌బండ్‌ను పట్టించుకోవాలి



ఆర్నెళ్ల క్రితం బోటింగ్ ఉండేది. పిల్లలతో కలిసి బోటింగ్ చేశా. ఇప్పుడు బంద్ అయింది. ఆకర్షణీయ కట్టడాలు దెబ్బతిన్నాయి. బెంచీలు విరిగిపోయాయి. బోటు పక్కన పడేశారు. అధికారులు వెంటనే ట్యాంక్‌బండ్‌ను అందుబాటులోకి తేవాలి. – రవీందర్, కోరుట్ల

అవసరమైన చర్యలు తీసుకుంటాం

కోరుట్లలోని మినీ ట్యాంక్‌బండ్ నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడతాం. పట్టణంలోని పిల్లల పార్కు బాగానే ఉంది. కేవలం ఫౌంటేన్ సరిగా నడవటం లేదు. త్వరలోనే బాగు చేయిస్తాం. వేసవిలో జనం సేదదీరడానికి అవసరమైన అన్ని ఏర్పాటు చేస్తాం. – బట్టు తిరుపతి, కమిషనర్, కోరుట్ల

తెలంగాణను పచ్చగా మార్చిన ఘనత కేసీఆర్‌ది

- బీఆర్ఎస్ నిజామాబాద్‌ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- బీర్‌పూర్‌లో ఎన్నికల సన్నాహక సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్

సారంగాపూర్: ఏడారిలా ఉన్న తెలంగాణను పదేళ్లలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు దక్కిందని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బీర్‌పూర్ మండలకేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ కంటే డబుల్ పథకాలు ఇస్తామని ప్రజలను నమ్మించి కాంగ్రెస్ పార్టీ ఓట్లు వేయించుకుందన్నారు. తనను గెలిపిస్తే గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ మతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ రావడంతోనే కరువు వచ్చిందన్నారు. ఇప్పటివరకు రైతుబంధు చెల్లించలేదన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, నాయకులు రమేశ్, నల్ల మహిపాల్‌రెడ్డి, రాజేశం ఉన్నారు. ముందుగా బాజిరెడ్డి బీర్‌పూర్ నృసింహస్వామిని దర్శించుకున్నారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్, చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ కోవర్టు

మల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ కోవర్టు అని బాజిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అమలుకు సాధ్యంకాని 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దితే రేవంత్‌రెడ్డి నాలుగు నెలల్లో నాశనం చేసేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి నిరుద్యోగులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీగా అర్వింద్ ఒక్క పని చేయలేదన్నారు. తనను ఆశీర్వదిస్తే సేవకుడిగా పనిచేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీ.గంగాధర్‌గౌడ్, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్ పాల్గొన్నారు.


అవగాహనతోనే కుష్ఠు నివారణ

మల్లాపూర్: అవగాహనతోనే కుష్ఠును నివారించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. వ్యాధి లక్షణాలున్న వారిని పరీక్షించారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే చికిత్సతో నయం చేయవచ్చన్నారు. ముందుగా రే గుంట సబ్‌సెంటర్‌ను సందర్శించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సమావేశంలో పీహెచ్‌సీ మెడికల్ అధికారి వాహిని, సీహెచ్‌వో రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఇందిర, ఫార్మసిస్ట్ సైఫొద్దీన్, స్టాఫ్‌నర్స్ సుమ, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న శ్రీనివాస్

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

జగిత్యాలక్రైం: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి మధు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని అపార్ట్‌మెంట్లలో నివసించే వారికి మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తక్షణమే స్పందించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, ప్రశాంత్, మల్లేశం, నరేశ్, వేణు పాల్గొన్నారు.